ప్రజాసేవే లక్ష్యంగా అడుగులు..!

- బస్తీల అభివృద్ధి కోసం ఒక్కటైన యువకులు
- 'ఫైవ్ ఫింగర్స్' పేరుతో సేవా కార్యక్రమాలు
- సమస్యలను పరిష్కరిస్తూ ముందుగు సాగుతున్న వైనం



పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న ఫైవ్ ఫింగర్స్ ప్రతినిధులు

బంజారాహిల్స్, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): ఫిలింనగర్ బీజేఆర్‌నగర్‌కు చెందిన కొందరు యువకులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇతరులకు సాయం చేయడమే లక్ష్యంగా తమ జీతంలోని కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు. ఫైవ్ ఫింగర్స్ పేరుతో ఏడాది క్రితం స్వచ్ఛంద సంస్థను స్థాపించి బస్తీల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా బీజేఆర్‌నగర్ పాఠశాలలో చదివే విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందించి అండగా నిలిచారు. ఓ గ్రంథాలయాన్ని సైతం ఏర్పాటు చేసి మేధావులు, వారి ఆవిష్కరణలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. స్థానిక అంగన్‌వాడీలో విద్యుత్ సరఫరా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండటంతో ఫైవ్ ఫింగర్స్ సంస్థ ప్రతినిధులే సమస్యను పరిష్కరించారు.

ఆస్పత్రి నిర్మాణం కోసం..

ఫిలింనగర్‌లో 18 మురికివాడలు ఉండగా బీజేఆర్ నగర్ ప్రభుత్వ ఆస్పత్రి ఒక్కటే అందుబాటులో ఉంది. కాని పదిహేను సంవత్సరాల క్రితం ఇది భూమిలోకి కుంగిపోవడంతో ఇక్కడి నుంచి ఆస్పత్రిని తొలగించి దీనికి సమీపంలో ఓ డిస్పెన్సరీ ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఫైవ్ ఫింగర్స్ సంస్థ ఆస్పత్రిని పునర్నిర్మించేందుకు ముందుకొచ్చింది. అవసరమైన నిధులను సైతం సిద్ధం చేసి అనుమతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో త్వరలోనే తమకు ఆస్పత్రి అందుబాటులోకి వస్తుందని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల బాక్స్

18 బస్తీల్లో నిత్యం ఏదో ఒక్క సమస్య ఎదురవుతుండగా.. చాలా మందికి సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. దీంతో ఫిర్యాదుల బాక్స్ చేసి ఏర్పాటు చేసి బస్తీల్లో మౌలిక సదుపాయాలైన తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. పోకిరీల వేధింపులు, తాగుబోతుల ఆగడాలు వంటి శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను సైతం తెల్లకాగితంపై రాసి బాక్స్‌లో వేస్తే సంస్థ ప్రతినిధులు ఆయా శాఖల అధికారులను కలిసి పరిష్కారమయ్యేలా చేస్తున్నారు.



ఓ అభాగ్యురాలికి దుప్పటి కప్పుతున్న దృశ్యం

మంచి చేయడమే లక్ష్యం

తాము పుట్టి పెరిగిన బస్తీలను బాగు చేసుకోవాలనే ఆలోచనతో పది మంది స్నేహితులం కలిసి ఫైవ్ ఫింగర్స్‌ను స్థాపించాం. సొంత ఖర్చులతో చిన్న చిన్న కార్యక్రమాలను చేయడం మొదలు పెట్టాం. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు అందజేశాం. ప్రజా వైద్యశాలను అందుబాటులోకి తీసుకురావాలనేది మా లక్ష్యం. దీనికి అందరూ సహకరించాలి.

\- శ్రీనివాస్

ఫిర్యాదుల బాక్స్‌తో ప్రయోజనం

ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు మా సంస్థ నిరంతరం పనిచేస్తుంది. ఫిర్యాదుల బాక్స్ అందుబాటులో ఉండటంతో బస్తీల్లో పోకిరీల బెడద తగ్గుతోంది. అధికారులు సహకరిస్తే ఫిలింనగర్‌ను సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దవచ్చు.

\- మహేష్

పాలకులు సహకరించాలి

ఫిలింనగర్ పరిధిలోని 18 బస్తీలకు ఆస్పత్రి వసతి లేదు. ఉన్న భవనం కుంగిపోయింది. దీంతో పేదలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. పాలకులు సహకరిస్తే ఆస్పత్రి నిర్మాణం పూర్తిచేస్తాం.

\- శ్యామ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హిందూ కార్యాలయం, సనత్‌నగర్ ఫీడర్ల పరిధిలోని వెంకట్ ప్లాజా, ఓరా, కృష్ణా జువెల్లర్స్, పోచమ్మ బస్తీ, పంజాగుట్ట, సౌభాగ్య నగర్, ఎస్‌ఆర్టీ క్వార్టర్స్, కైలాష్ నగర్, సుభాష్ నగర్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు గ్రీన్ ల్యాండ్స్, ఎఫ్‌సీఐ గోడౌన్ ఫీడర్ల పరిధిలోని నీరజ్ పబ్లిక్ స్కూల్, వీఐపీ షోరూం, లాల్ బంగ్లా, ఎర్రగడ్డ ప్రధాన రహదారి, ఎఫ్‌సీఐ గోడౌన్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.



ఖైరతాబాద్ వద్ద బాల్కాపూర్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

నాలాలో గుట్టలుగా వ్యర్థాలు

పంజాగుట్ట, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): బంజారాహిల్స్ నుంచి ఆనంద్‌నగర్, తుమ్మలబస్తీ మధ్యలో నుంచి బాల్కాపూర్ వెళ్లే నాలాలో వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి. ఖైరతాబాద్ ప్రధాన రహదారి నుంచి తుమ్మలబస్తీకి వెళ్లే మార్గంలో బ్రిడ్జి కింద వ్యర్థాలు గుట్టలా పేరుకుపోయాయి. గతంలో ఇక్కడ నాలాలోకి దిగి వ్యర్థాలను ఏరుకునే క్రమంలో ఓ వ్యక్తి ఆ వాటి మధ్య ఇరుక్కుని మృతి చెందాడు. అయినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. నాలాలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని వారు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకం పేరుతో సైబర్ వల

- రూ.1.32 లక్షలు మోసపోయిన వ్యక్తి

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా నిధులు మంజూరయ్యాయని నమ్మబలికిన సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ.1.32 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి(33)కి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి తాము జనరల్ బ్యాంకు అధికారులమని పరిచయం చేసుకున్నారు. తమ బ్యాంకు ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నిధులు విడుదలవుతాయని, మీ పేరున ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం కింద 30 శాతం రాయితీతో రూ.5 లక్షల రుణం మంజూరైందంటూ పత్రాలు చూపారు. ఈ రుణానికి సంబంధిచి ప్రతి నెలా రూ.5,480 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. బ్యాంకు చార్జీలు, ఇన్సూరెన్స్, డీడీ చలాన్ చార్జీలు, రిఫండబుల్ ఎమౌంట్ మొత్తం కలిపి రూ.1,32,510 చెల్లిస్తే, రూ.5 లక్షలకు ఈ మొత్తం కలిపి చెక్కు రూపంలో ఇంటికి వస్తుందని నమ్మబలికారు. వీరి మాటలు నమ్మిన బాధితుడు వారి ఖాతాలో డబ్బు జమ చేశాడు. ఎన్ని రోజులు వేచి చూసినా చెక్కు రాకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తల్లి మందలించిందని యువతి అదృశ్యం



కరిష్మాకుమారి

బోయిన్ పల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి తిరిగి రాలేదు. బోయిన్‌పల్లి ఎస్‌ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురం కాలనీకి చెందిన కరిష్మాకుమారి ఈ నెల 22న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కొన్ని రోజుల నుంచి ఆమె నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతున్న విషయం గ్రహించిన తల్లి కూతురును హెచ్చరించింది. అయినప్పటికీ ఆమె వినకుండా సెల్ ఫోన్‌లో మాట్లాడుతుండటంతో యువకుడిని సైతం యువతి తల్లి హెచ్చరించింది. ఈ క్రమంలో ఈ నెల 22న బయటకు వెళ్లిన తమ కూతురు తిరిగి రాలేదని, దీంతో అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభించలేదని తల్లి చోటి రూబీదేవి సోమవారం ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

పాఠశాలల్లో సదుపాయాలను మెరుగుపరచాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో సదుపాయాలను మెరుగుపరచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. హాస్టళ్లలో శానిటేషన్, కిచెన్, స్టోర్‌రూమ్‌ల నిర్వహణ బాగుండాలని, లేదంటే వార్డెన్లు, ప్రిన్సిపాళ్లపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వసతి గృహాల నిర్వహణపై వార్డెన్లు, ప్రత్యేక అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెసిడెన్షియల్ పాఠశాలల్లో కిచెన్, స్టోర్‌రూమ్, భోజనశాల నిర్వహణపై వందమార్కులు కేటాయించామని, 75 శాతం కంటే తక్కువ వచ్చిన వార్డెన్లు, ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పని తీరు మెరుగుపరుచుకో అధికారులను విధుల నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ప్రత్యేక అధికారులు ప్రతి వారం తమకు కేటాయించిన హాస్టళ్లను తనిఖీ చేసి నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు.

పకడ్బందీగా ఆపరేషన్ రోప్

- ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): ఆపరేషన్ రోప్‌ను ఇకపై పకడ్బందీగా అమలు చేస్తామని పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ అన్నారు. రోప్‌లో భాగంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్‌లు, ఫుట్‌పాత్ వ్యాపారాలను ఆయన సోమవారం తొలగింపజేశారు. మరోసారి ఇలా చేస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని వ్యాపారులను ఏసీపీ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ రోప్‌లో భాగంగా సుమారు 300 ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగించామని, ఇంకా కొన్ని చోట్ల డ్రైవ్ నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అక్రమ పార్కింగ్‌లు, ఫుట్‌పాత్ వ్యాపారాలను తిరిగి ఏర్పాటు చేయకుండా పోలీసుల నిఘా ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్‌లు సాయిప్రకాశ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగిస్తున్న దృశ్యం



ఏబీఎన్ కార్యాలయం పక్కనే ఉన్న చెట్ల కొమ్మలు



ఫిలింనగర్ సిద్దప్ప హోటల్ వద్ద ఉన్న కొమ్మలు

కట్ చేశారు సరే.. ఎవరు తీస్తారు?

- రోడ్లపై కుప్పలుగా చెట్ల కొమ్మలు
- కొట్టేసి వదిలేసిన ట్రాన్స్‌కో సిబ్బంది

బంజారాహిల్స్, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): చెట్ల కొమ్మలను కొట్టేసిన ట్రాన్స్‌కో సిబ్బంది వాటిని రోడ్లపైనే వదిలేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఫిలింనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను పది రోజుల క్రితం కట్ చేశారు. వాటిని తొలగించకపోవడంతో కుప్పలుగా పడిఉన్న కొమ్మల కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఏబీఎన్ ఛానెల్ వద్ద దారి చిన్నదిగా ఉండటంతో ఈ కొమ్మల కారణంగా రాకపోకలకు ఆటంకాలు కలుగుతున్నాయి. రాత్రి సమయంలో వాటిని చూసుకోకుండా వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని.. వెంటనే అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉస్మానియా వర్సిటీ గేట్లు రాత్రి 9 తర్వాతే బంద్

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన గేట్లను రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంచాల్సిందిగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.కుమార్ భద్రతా సిబ్బందిని ఆదేశించారు. అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వీసీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉస్మానియా వర్సిటీ ప్రధాన గేట్లు (ఎన్‌సీసీ వైపు, పోలీస్‌స్టేషన్ వైపు) రాత్రి 8 గంటలకు మూసివేస్తుండగా.. తాజా నిర్ణయంతో మరో గంట అదనంగా వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించారు. రామంతాపూర్ వైపుగా ఉన్న రవీంద్రనగర్ కాలినడక ద్వారం నుంచి కూడా రాకపోకలకు ఉదయం, సాయంత్రం కొంత వెసులుబాటు కల్పించారు. ఓయూలో పలు నిర్మాణాలు జరుగుతుండడంతో అక్కడే నివాసముంటున్న కూలీల పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు వీలుగా పాఠశాల సమయానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల శిక్ష

పహాడిషరీఫ్ నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలికను ప్రేమపేరుతో వేధించి, అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగికదాడికి ప్రయత్నించిన కేసులో నిందితుడు మహ్మద్ జియాన్ అలియాస్ మహ్మద్ ఒమర్‌కు రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్‌లోని ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయసేవాధికారి సోమవారం మూడేళ్ల శిక్ష, ఐదు వేల జరిమానా విధించారని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు.

కాంగ్రెస్ నేత అండతో భూమి కబ్జా చేశారు

- నల్గొండ జిల్లాకు చెందిన సావిత్రమ్మ ఆరోపణ



మాట్లాడుతున్న లొట్లపల్లి సావిత్రమ్మ

పంజాగుట్ట, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): తన తల్లి నుంచి వారసత్వంగా వచ్చిన రెండెకరాల 10 గుంటల భూమి కబ్జాకు గురైందని, ఆ భూమిపై తనకు హక్కులు కల్పించి పాస్‌బుక్ ఇప్పించాలని నల్గొండ జిల్లా దామచర్ల మండలం ఇర్కిగూడెం గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు ప్రభుత్వాన్ని వేడుకుంది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బాధితురాలు లొట్లపల్లి సావిత్రమ్మ మాట్లాడింది. ఇర్కిగూడెం సర్వే నంబర్ 11/105లోని 2.10 ఎకరాల భూమి తన తల్లి కొటిక లచ్చమ్మ నుంచి వారసత్వంగా వచ్చిందని, దానిని 2020 వరకు సాగుచేసినట్లు తెలిపింది. తర్వాత వయస్సు పై బడడం, కుమారుడు మానసిక వైకల్యంతో బాధపడుతుండడంతో పంటలు వేయలేదని.. దీంతో భూమి పడావుగా ఉండడంతో కబ్జాదారుల కన్ను పడిందని ఆమె పేర్కొంది. కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి ముఖ్య నాయకుడి మద్దతుతో కొంత మంది తనకు ఇబ్బందులు సృష్టించారని, తప్పుడు పత్రాలతో భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై ప్రశ్నిస్తే తన కుమారుడిపై దాడి చేశారని, తనకు న్యాయం చేయాలని దామరచర్ల తహసీల్దార్, రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని చెప్పింది. సర్వే నంబర్ 11లోని భూమి ప్రభుత్వ భూమి అంటూ తహసీల్దార్ కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది.

నరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని లక్ష్మీనరసింహ(స్వర్ణ) దేవాలయంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. కలశ యాత్ర, అగ్నిప్రతిష్ఠ, శ్రీదేవి, భూదేవి సమేత నర్సింహస్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర ప్రభు ప్రవచనాలను వల్లించారు.



స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం





తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టిన గద్దర్ కుమార్తె వెన్నెలను బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్, అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైభీమ్ యాదగిరి, బోరబండ డివిజన్ అధ్యక్షుడు పావనం శివశంకర్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

\- బోరబండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి)

పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ. 2.48 లక్షలు కాజేశారు

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్ట్ టైం ఉద్యోగం చేసి డబ్బు సంపాదించాలని భావించిన ప్రైవేటు ఉద్యోగికి పెట్టుబడి ఆశ చూపిన సైబర్ నేరగాళ్లు రూ.2.48 లక్షలు కొల్లగొట్టారు. నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి పార్ట్‌టైం ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో వెతికాడు. ఈ సమయంలో సైబర్ నేరగాడు వాట్సాప్ ద్వారా అతడిని సంప్రదించి జియోటో డిజిటల్ మార్కెటింగ్ సంస్థ హెచ్‌ఆర్‌గా పరిచయం చేసుకున్నాడు. గూగుల్ రివ్యూలు, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ చేస్తే రోజువారీ జీతం ఇస్తామని చెప్పాడు. ఓ లింక్ ద్వారా గ్రూపులో జాయిన్ చేయించాడు. మొదటి రోజు లింక్‌లను సబ్‌స్క్రైబ్ చేయించి ఖాతాలో రూ.200 జమ చేశారు. అనంతరం పెట్టుబడి పెడితే ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పడంతో బాధితుడు రూ.1,010 పెట్టుబడి పెట్టగా గంటల వ్యవధిలోనే అతడి ఖాతాలో రూ.1,500 జమ చేశారు. అదే విధంగా రూ.3,010 డిపాజిట్ చేసి కొన్ని గంటలు పని చేస్తే రూ.4,600 ఖాతాలో వేశారు. ఇలా పలు మార్లు చేసి నమ్మకం వచ్చిన తర్వాత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టాలని సూచించారు. అతడితో రూ.2,48,693 పెట్టుబడి పెట్టించిన తర్వాత స్పందించడం మానేశారు. దీంతో అతడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

లారీని ఓవర్‌టేక్ చేయబోయి రోడ్డు ప్రమాదం

కవాడిగూడ, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఒకరు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగాడికుంటలోని ఎస్వీ వైన్స్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గాంధీనగర్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడకు చెందిన శివ, రాజు, ప్రశాంత్(19) ద్విచక్రవాహనంపై ముగ్గురు సోమవారం తెల్లవారుజామున లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి వెళుతుండగా సింగాడికుంట ఎస్వీ వైన్స్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేస్తుండగా లారీ టైరు తగలడంతో వారు అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ఘటనలో ప్రశాంత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. శివ, రాజు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రశాంత్ చికిత్స పొందుతూ మృతి చెందగా.. మిగతా ఇద్దరు గాంధీలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రశాంత్ మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి సాయంత్రం వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును గాంధీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతిచెందిన యువకుడు

బేగంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బస్టాప్ వద్ద ఉన్న విద్యుత్ రింగ్ మెయిన్ యూనిట్ బాక్స్‌లోని తీగలు తగిలి యువకుడు మృతిచెందిన ఘటన బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద చోటుచేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రాంతంలో బ్రేక్ డౌన్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో బేగంపేట సబ్‌స్టేషన్ నుంచి ఏఈ త్రిమూర్తులకు సమాచారం రావడంతో ఆయన సిబ్బందితో కలిసి పరిశీలిస్తుండగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బస్‌స్టాప్ వెనుక ఓ యువకుడు పడి ఉన్నాడు. 11కేవీ విద్యుత్ రింగ్ మెయిన్ యూనిట్ (ఆర్ ఎంయూ) బాక్స్ వద్ద పడి ఉన్న అతడిని పరిశీలించగా విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గుర్తించారు. ప్రమాదవశాత్తూ చేయి తగిలి విద్యుదాఘాతం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఏఈ త్రిమూర్తులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వరలక్ష్మి తెలిపారు.

మింట్ కాంపౌండ్ రహదారి తెరిచేదెప్పుడో?

- నత్తనడకన బాక్స్ డ్రెయిన్ పనులు
- విద్యుత్ శాఖకు ఫిర్యాదు చేసిన ముద్రణాలయ ఉద్యోగులు

ఖైరతాబాద్, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): ఖైరతాబాద్ గణపతి చౌరస్తా నుంచి మింట్ కాంపౌండ్ వెళ్లే దారిలో ప్రభుత్వ ముద్రణాలయం వద్ద 15 రోజులుగా రోడ్డును మూసేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిని మూసివేసి నత్తనడకన పనులు చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఖైరతాబాద్ ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్ ముంపు సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే దానం నాగేందర్ చొరవతో రూ.2.6 కోట్లతో బాక్స్ డ్రెయిన్ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే బాక్స్‌డ్రైన్ పనులు, సంపు నిర్మాణ పనులు పూర్తి కాగా, ప్రభుత్వ ముద్రణాలయ స్థలం లో చేయాల్సిన పనులకు సంస్థ అనుమతులు ఆలస్యంగా రావడంతో ప్రస్తుతం జరుగుతున్నాయి. అయితే రోజూ వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే మార్గాన్ని మూసివేసి తవ్వకాలు జరిపిన కాంట్రాక్టర్.. రోడ్డు వద్ద పనులు పూర్తి చేయకుండా లోపలి పనులు చేస్తుండడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇంజనీర్లు, కాంట్రాక్టర్ కుమ్మక్కై పనులు ఇష్టానుసారంగా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రమాదకరంగా విద్యుత్ కేబుళ్లు..

ప్రభుత్వ ముద్రణాలయం ముందు నుంచి సీబీఐ క్వార్టర్స్‌కు వేస్తున్న బాక్స్ డ్రెయిన్ మధ్యలో విద్యుత్ శాఖకు చెందిన 11కేవీ, 33కేవీ కేబుళ్లు ఉన్నాయి. వాటిని బాక్స్ డ్రైన్ మీదుగా వెళ్లేలా పనులు నిర్వహిస్తున్నారు. పనుల ప్రారంభంలో తవ్వుతుండగా ఒక కేబుల్ కొంత మేరకు దెబ్బతినగా, దాన్ని ట్యూబ్‌లతో చుట్టేసి పనులు చేస్తున్నారు. అయితే చిన్న వర్షం వచ్చినా బాక్స్ డ్రైన్ గుండా తరచూ నీరు వచ్చే అవకాశాలు ఉండడంతో ఈ విద్యుత్ కేబుళ్లు ప్రమాదకరంగా మారతాయని ప్రభుత్వ ముద్రణాలయ ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని, ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ముద్రణాలయ ఉద్యోగుల జేఏసీ విద్యుత్‌శాఖ డీఈకి ఫిర్యాదు చేసింది.



ముద్రణాలయం ఎదురుగా జరుగుతున్న పనులు



రోడ్డుపైనే ద్విచక్రవాహనాలను పార్క్ చేసిన దృశ్యం

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్..

ప్రభుత్వ ముద్రణాలయం వద్ద ఉద్యోగులు, అధికారుల వాహనాలను పార్కింగ్ చేసే స్థలంలో పనులు జరుగుతుండటం, ముద్రణాలయం ముందున్న రెండు దారులను మూసివేయడంతో వారి వాహనాలను రోడ్డుపై నిలపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఖైరతాబాద్ టు మింట్ కాంపౌండ్ చౌరస్తాతో పాటు ఖైరతాబాద్ గణపతి మార్గంలో వాహనాల రద్దీతో కనీసం నడిచేందుకు సైతం వీలు లేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రోడ్డు నిలిపివేసిన చోట మొదట వేగవంతంగా పనులు నిర్వహించి రోడ్డు పునరుద్ధరణ తర్వాత మిగతా పనులను చేయాలని ప్రజలు కోరుతున్నారు.






కార్తీకమాసం చివరి సోమవారం సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాలు తెల్లవారు జాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. వారికి ఇబ్బందులు కలుగకుండా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



హాజరు పట్టికను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు : శ్రీగణేష్

సికింద్రాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష ప్రభుత్వ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. రసూల్‌పురాలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, సీబీఎస్ నగర్‌లోని బస్తీ దావాఖానాను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. బస్తీ దావాఖానలో మెడికల్ ఆఫీసర్ లేకపోవడం, హెల్త్‌సెంటర్‌లో వైద్యులు, సిబ్బంది లేకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉన్నతాధికారులకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. బస్తీ దావాఖానాల్లో, హెల్త్ సెంటర్లలో సిబ్బంది హాజరు కోసం అన్ని చోట్లా బయోమెట్రిక్ సిస్టమ్ ఏర్పాటు చేసేలా ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడతానని శ్రీగణేష్ చెప్పారు.

వీధిదీపాల సమస్యకు పరిష్కారం

రాంగోపాల్‌పేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలో వీధిదీపాల సమస్యకు పరిష్కారం లభించింది. చుట్టలబస్తీ ప్రాంతంలో వీధిదీపాల సమస్యను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ విద్యుత్ శాఖ అధికారులతో చర్చించి పరిష్కరించారని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.



చుట్టల బస్తీలో వెలుగుతున్న వీధి దీపాలు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

బౌద్ధనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సీతాఫల్‌మండి విద్యార్థి జీఎం రేవంత్ ప్రతిభ చాటాడు. ఇటీవల నగరంలో జింఖానా మైదానంలో అండర్17, 19 వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలు, కాలేజీల నుంచి సుమారు 175 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీతాఫల్‌మండిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జీఎం రేవంత్ అండర్-17 పోటీల్లో మొత్తం 200 కేజీలు ఎత్తి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు, కార్యదర్శి శ్రీనివాస్, కోచ్‌లు శ్రవణ్, శివకుమార్, రాజు తదితరులు జీఎం రేవంత్‌ను అభినందించారు. జైపూర్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో కోచ్ డీడీశర్మ వద్ద రేవంత్ శిక్షణ పొందుతున్నాడని తండ్రి నాని తెలిపారు.



పోటీల్లో పాల్గొన్న రేవంత్

సికింద్రాబాద్ సేవాదళ్ ఉపాధ్యక్షురాలిగా రామలీల

అడ్డగుట్ట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం సేవా దళ్ ఉపాధ్యక్షురాలిగా తుకారాంగేట్‌కు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకురాలు రామలీల ఎన్నికయ్యారు. ఈ మేరకు సేవాదళ్ అధ్యక్షుడు మిద్దల జితేందర్ చేతుల మీదుగా సోమవారం నియమాక పత్రాన్ని అందుకున్నారు.



సికింద్రాబాద్ ఉపాధ్యక్షురాలిగా నియమాక పత్రాన్ని అందుకుంటున్న రామలీల



దివ్యాంగుల ఆటల పోటీలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్‌రావు

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడోత్సవాలు

ఎల్బీనగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సరూర్‌నగర్ స్టేడియం లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం క్రీడోత్సవాలు నిర్వహించారు. సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి, జిల్లా యువజన క్రీడల అధికారి వెం కటేశ్వర్‌రావుతో కలిసి క్రీడోత్సవాలను ప్రారంభించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో దివ్యాంగులకు 50మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్ల విభాగంలో పరుగు పందెం, షాట్‌పుట్, చెస్, క్యారమ్స్, వీల్‌చైర్, ట్రై సైకిల్ రేస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీవాణి మాట్లాడుతూ వైకల్యం లక్ష్యసాధనలో అడ్డుకావొద్దన్నారు. ఈ జిల్లా స్థాయి పోటీలలో విజేతలను రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ ఆటల పోటీలలో మొత్తం జిల్లా నుంచి దాదాపు 500 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీడీఆర్సీ ప్రతినిధి రమేష్, సీడీపీఓలు, ఐసీడీఎస్ స్టాఫ్, ఐసీపీఎస్ సిబ్బంది, డిసెబుల్డ్, డీహెచ్‌ఈడబ్ల్యూ, సఖి సభ్యులు పాల్గొన్నారు.

ఫీవర్ ఆస్పత్రికి రోగుల తాకిడి

- వైరల్ ఫీవర్, గొంతునొప్పి, దగ్గు, జలుబుతో ఇబ్బందులు
- చలికాలంలో జాగ్రత్తగా ఉండాలని వైద్యుల సూచన

బర్కత్‌పుర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన మార్పులు, చలి తీవ్రత పెరగడంతో ప్రజలు జ్వరాల బారినపడుతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో వైరల్ ఫీవర్ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రాత్రి, ఉదయం వేళల్లో చలి తీవ్రంగా ఉండడంతో ప్రజలు వైరల్ ఫీవర్‌తో పాటు దగ్గు, జలుబు బారిన పడుతున్నారు. నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రి జ్వరపీడితులతో కిటకిటలాడుతోంది. ఫీవర్ ఆస్పత్రిలో సోమవారం 568 మంది ఓపీ రిజిస్ట్రేషన్ కాగా వారిలో అత్యధిక శాతం వైరల్ ఫీవర్ బాధితులే ఉన్నారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న 12 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఆస్పత్రిలో ప్రస్తుతం వంద మంది రోగులు ఇన్‌పేషంట్లుగా చికిత్స పొందుతున్నారు. డెంగ్యూ కేసులు కూడా నమోదవుతున్నాయి. శనివారం మూడు, సోమవారం మరో మూడు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. చలి తీవ్రత వల్ల వృద్ధులు, చిన్నారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కాచి వడబోసిన నీటిని తాగాలని, బయట ఆహార పదార్థాలు తీసుకోవద్దని సూచిస్తున్నారు. డిసెంబర్ నెలలో చలి తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉందని, గుండె జబ్బులు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారు జాగ్రత్తగా ఉండాలని పేర్కొంటున్నారు.



ఫీవర్ ఆస్పత్రిలో రోగుల రద్దీ

వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలి

వృద్ధులు, చిన్నారులు తగు జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. చలికాలంలో వృద్ధులు, గుండె జబ్బులతో బాధపడే వారు వాకింగ్‌కు వెళితే తప్పనిసరిగ్గా మాస్క్ ధరించాలి. చలికాలం లో అందరూ జాగ్రత్తలు పాటించాలి. జ్వరం, దగ్గు సమస్యలు ఉన్నవారు వెచ్చని వాతావరణంలో ఉండాలి. అవసరమైతేనే బయటకు వెళ్లాలి. శీతల పానియాలు, ఐస్‌క్రీమ్‌లకు దూరంగా ఉండాలి. బయటకు వెళ్లినప్పుడు చెవిలో దూది తప్పనిసరిగ్గా పెట్టుకోవాలి.

- డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్

పాఠశాలల్లో సదుపాయాలను మెరుగుపరచాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో సదుపాయాలను మెరుగుపరచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. హాస్టళ్లలో శానిటేషన్, కిచెన్, స్టోర్‌రూమ్‌ల నిర్వహణ బాగుండాలని, లేదంటే వార్డెన్లు, ప్రిన్సిపాళ్లపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వసతి గృహాల నిర్వహణపై వార్డెన్లు, ప్రత్యేక అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలల్లో కిచెన్, స్టోర్‌రూమ్, భోజనశాల, వంటగది నిర్వహణ పనితీరుపై వందమార్కులు కేటాయించామని, 75 శాతం కంటే తక్కువ వచ్చిన వార్డెన్లు, ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనితీరు మెరుగుపరచుకోని అధికారులను విధుల నుంచి సస్పెండ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రత్యేక అధికారులు ప్రతి వారం తమకు కేటాయించిన హాస్టళ్లను తనిఖీ చేసి నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఓయూ గేట్లు రాత్రి తొమ్మిది వరకు ఓపెన్

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన గేట్లను రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంచాల్సిందిగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.కుమార్ భద్రతా సిబ్బందిని ఆదేశించారు. అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వీసీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉస్మానియా వర్సిటీ ప్రధాన గేట్లు (ఎన్‌సీసీ వైపు, పోలీస్‌స్టేషన్ వైపు) రాత్రి 8 గంటలకు మూసివేస్తుండగా... తాజా నిర్ణయంతో మరో గంట అదనంగా వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించారు. రామంతాపూర్ వైపుగా ఉన్న రవీంద్రనగర్ కాలినడక ద్వారం నుంచి కూడా రాకపోకలకు ఉదయం, సాయంత్రం కొంత వెసులుబాటు కల్పించారు. ఓయూలో పలు నిర్మాణాలు జరుగుతుండడంతో అక్కడే నివాసముంటున్న కూలీల పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు వీలుగా పాఠశాల సమయానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ నియామకం

రవీంద్రభారతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఆచార్య కోట్ల హనుమంతరావు నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఉత్తర్వు జారీ చేసి నియామకపత్రం అందజేశారు. సోమవారం ఆచార్య కోట్ల హనుమంతరావు బాధ్యతలు చేపట్టారు. హనుమంతరావు లలితకళాపీఠం పీఠాధిపతిగానూ, పరీక్షల నియంత్రణ అధికారిగానూ, రంగస్థల కళల శాఖ అధిపతిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న రెడ్డి శ్యామల సోమవారం పదవీ విరమణ చేశారు.



హనుమంతరావుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న వీసీ నిత్యానందరావు

'రైతులు- రాజ్యాంగం'పై నేడు చర్చ

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని తార్నాకలోని లీఫ్ సంస్థ కార్యాలయంలో రైతులు-రాజ్యాంగం అనే అంశంపై మంగళవారం చర్చా కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నామని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, లీఫ్ సంస్థ అధ్యక్షుడు సునీల్ సోమవారం తెలిపారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాంతోపాటు రైతుచట్టాల నిపుణులు, రైతుల కోసం పనిచేసే పలువురు మేధావులు పాల్గొంటారన్నారు. రైతు సంక్షేమ కమిషన్ చేపడుతున్న కార్యక్రమాలు, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న రైతులు-రాజ్యాగం అనే కార్యక్రమ వివరాలను సోమవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వివరించారు. వారిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించినట్లు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, భూచట్టాల నిపుణుడు సునీల్ తెలిపారు. భూవివాదాలు విపరీతంగా పెరిగాయని, భూ సమస్యలు తక్షణం పరిష్కరించి రైతులకు సత్వర న్యాయం అందించాలనేది రాజ్యాంగం విధించిన బాధ్యత అని సునీల్ పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకత, భూ సమస్యల సత్వర పరిష్కారం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ఈ ఉద్దేశంతోనే రాజ్యాంగంలో ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుగా పేర్కొన్నారని తెలిపారు.



హరికిరణ్‌ను కలిసిన గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఎక్సైజ్ డైరెక్టర్‌ను కలిసిన 'గెజిటెడ్ ఆఫీసర్స్'

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చెవ్వూరి హరికిరణ్‌ను ఆ శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మెదక్ డిప్యూటీ కమిషనర్ జి.హరికిషన్, అసిస్టెంట్ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు చంద్రయ్య, గణేశ్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రదీప్ రావు, ఉజ్వలరెడ్డి, జీవన్, కిరణ్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

బేగంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బస్టాప్ వద్ద ఉన్న విద్యుత్ రింగ్ మెయిన్ యూనిట్ బాక్స్‌లోని తీగలు తగిలి యువకుడు మృతిచెందిన ఘటన బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద చోటుచేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రాంతంలో బ్రేక్ డౌన్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో బేగంపేట సబ్‌స్టేషన్ నుంచి ఏఈ త్రిమూర్తులకు సమాచారం రావడంతో ఆయన సిబ్బందితో కలిసి పరిశీలిస్తుండగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బస్‌స్టాప్ వెనుక ఓ యువకుడు పడి ఉన్నాడు. 11కేవీ విద్యుత్ రింగ్ మెయిన్ యూనిట్ (ఆర్‌ఎంయూ) బాక్స్ వద్ద పడి ఉన్న అతడిని పరిశీలించగా విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గుర్తించారు. ప్రమాదశాత్తూ ఆర్‌ఎంయూ బాక్స్‌కు చేయి తగిలి విద్యుదాఘాతం జరిగి ఉంటుందన్నారు. ఏఈ త్రిమూర్తులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు.



మృతిచెందిన యువకుడు

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

రాంనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శీతాకాల పార్లమెంట్ సమావేశంలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని బీసీ జాగృతి సేన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు బురుగుపల్లి కృష్ణయాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ యన మాట్లాడారు. 2018లో పార్లమెంట్ సాక్షిగా ప్రధాని మోదీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీ గణన చేపట్టి జనాభా ప్రాతిపదికన అన్ని కులాలకు రాజ్యాంగ పరంగా రావాల్సిన వాటాను కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు గొరిగే మల్లేష్‌యాదవ్, నాయకులు నికిత్, రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బురుగుపల్లి కృష్ణయాదవ్

రైలు ప్రయాణికురాలి సెల్‌ఫోన్, నగదు చోరీ

బర్కత్‌పుర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి సెల్‌ఫోన్, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. నగరంలోని హరిపురి కాలనీకి చెందిన నాగరాణి(79) మధురై - కాచిగూడ స్పెషల్ రైలులో నగరానికి వస్తుంది. అనంతపురం వద్ద బ్యాగులో ఉన్న సెల్‌ఫోన్, 10 వేల నగదు, ఎస్‌బీఐ ఏటీఎం కార్డు కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన నాగరాణి సోమవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం అనంతపురం రైల్వే పీఎస్‌కు బదిలీ చేశారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల శిక్ష

పహాడిషరీఫ్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలికను ప్రేమపేరుతో వేధించి, అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగికదాడికి ప్రయత్నించిన కేసులో నిందితుడు మహ్మద్ జియాన్ అలియాస్ మహ్మద్ ఒమర్‌కు రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్‌లోని ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయసేవాధికారి సోమవారం మూడేళ్ల శిక్ష, ఐదు వేల జరిమానా విధించారని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు.


చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: చేపలవేటకు వెళ్లి కాముని చెరువులో పడి వ్యక్తి మృతిచెందాడు. ఆర్జీఐఏ పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. నగరంలోని ముషీరాబాద్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్(29) ఆదివారం చేపల వేటకు అని శంషాబాద్ మున్సిపల్‌లో ఉన్న కాముని చెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు ఒడ్డుకు తీసుకొచ్చారు. ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతిచెందాడు.

లారీని ఓవర్‌టేక్ చేయబోతుండగా ప్రమాదం

ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు

కవాడిగూడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ఒకరికి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ గాంధీ ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగాడికుంటలోని ఎస్‌వీ వైన్స్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. గాంధీనగర్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయి గూడకు చెందిన శివ, రాజు, ప్రశాంత్(19)లు హోండా హాక్టివా (టీఎస్ 08 జేయూ 4316) ద్విచక్రవాహనంపై ముగ్గురు సోమవారం తెల్లవారుజామున లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి వెళుతుండగా సింగాడికుంట ఎస్‌వీ వైన్స్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేస్తుండగా లారీ టైరు తగలడంతో వారు అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో ప్రశాంత్ అనే యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. శివ, రాజులకు స్వల్పంగాగాయపడ్డాడు. వెంటనే సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. తలకు గాయాలైన ప్రశాంత్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, మిగతా ఇద్దరు గాంధీలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రశాంత్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సాయంత్రం వారి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన ప్రశాంత్

పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ.2.48 లక్షలకు టోకరా

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైం ఉద్యోగం చేసి డబ్బు సంపాదించాలని భావించిన ప్రైవేటు ఉద్యోగికి పెట్టుబడి ఆశ చూపిన సైబర్ నేరగాళ్లు రూ.2.48 లక్షలు కొల్లగొట్టారు. నగరానికి చెందిన ప్రైవేట్‌ఉద్యోగి పార్ట్‌టైం ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో వెతికాడు. ఈ సమయంలో సైబర్ నేరగాడు వాట్సాప్ ద్వారా సంప్రదించాడు. తాను జియోట్టో డిజిటల్ మార్కెటింగ్ సంస్థ హెచ్‌ఆర్‌గా పరిచయం చేసుకున్నాడు. గూగుల్ రివ్యూలు, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ చేస్తే రోజు వారీ జీతం ఇస్తామని చెప్పాడు. ఓ లింక్ ద్వారా గ్రూపులో జాయిన్ చేయించాడు. మొదటి రోజు లింక్‌లను సబ్‌స్ర్కైబ్ చేయించి ఖాతాలో రూ. 200 జమ చేశారు. పెట్టుబడి పెడితే ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పారు. బాధితుడు రూ.1010 పెట్టుబడి పని చేస్తే గంటల వ్యవధిలో అతడి ఖాతాలో రూ.1,500 జమ చేశారు. అదే విధంగా రూ.3,010 డిపాజిట్ చేసి కొన్ని గంటలు పనిచేస్తే రూ.4,600 ఖాతాలో వేశారు. ఇలా పలుమార్లు చేసి నమ్మకం వచ్చిన తర్వాత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టాలని సూచించారు. అతడితో రూ.2,48,693 పెట్టుబడి పెట్టించిన తర్వాత స్పందించడం మానేశారు. దాంతో బాధితుడు సైబర్ క్రైం రాజాలో ఫిర్యాదు చేశాడు.

వైర్ తెగి కుప్పకూలిన లిఫ్ట్.. ఆరుగురికి గాయాలు

మదీన, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ భవనంలో లిఫ్ట్ తెగిపడి ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందులాల్ బారాదరిలో అబ్దుల్ ఖుద్దూస్ అనే వ్యక్తి సోదరులతో కలిసి ఒకే అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో ఆరుగురు వ్యక్తులు లిఫ్ట్‌లో వెళ్తుండగా ఒక్కసారిగా తీగ తెగిపోయింది. దీంతో లిఫ్ట్ నేలమీద పడింది. అందులో ఉన్న ఆరుగురికి గాయాలయ్యాయి. ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. లిఫ్ట్‌లో ఓవర్ వెయిట్ కారణంగా వైర్ తెగిపోయిందని భావిస్తున్నారు. కాలాపత్తర్ పోలీసులు భవన యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని యువతి అదృశ్యం

బోయిన్‌పల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి తిరిగి రాలేదు. బోయిన్‌పల్లి ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురం కాలనీకి చెందిన కరిష్మాకుమారి ఈనెల 22న మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కొన్నిరోజుల నుంచి ఆమె నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతున్న విషయం గ్రహించి తల్లి కూతురును హెచ్చరించింది. ఆమె వినకుండా సెల్ ఫోన్‌లో నిరంతరం ఓ వ్యక్తితో మాట్లాడుతుంది. దీంతో ఇద్దరినీ యువతి తల్లి హెచ్చరించింది. ఈనెల 22న బయటకు వెళ్లిన తమ కూతురు తిరిగి రాలేదని, దీంతో అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు తల్లి చోటి రూబీదేవి సోమవారం ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదుచేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



అదృశ్యమైన యువతి కరిష్మాకుమారి